ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

- ఇంత వరకు 66 సచివాలయాల్లో సేవలు
- 20,135 మందికి ఉచిత వైద్యం

మామిడికుదురు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ శిబిరానికి వచ్చి ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకున్నారు. పలు విభాగాలకు చెందిన ప్రముఖ డాక్టర్లు ప్రత్యేక వైద్య శిబిరాల్లో సేవలందిస్తున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో గత నెల 30వ తేదీ నుంచి ఇంత వరకు 66 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. 66 సచివాలయాల్లో 20,137 మందికి ఉచితంగా వైద్య సేవ


కొమరాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి తరలి వచ్చిన ప్రజలు

లందించారు. ప్రజలకు అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ముందుగా గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి బీపీ, సుగర్ తదితర పరీక్షలు నిర్వహించి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిని శిబిరాలకు తీసుకు వస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో వైద్య సేవలందిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమ ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుని సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని దీని వల్ల తమకు ఎంతో మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉచితంగా ప్రభుత్వ సేవలందుకున్న ప్రజల అభిప్రాయాలను పరిశీలిద్దాం.

ఉచితంగా వైద్య సేవలందించారు



వారం రోజుల క్రితం వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు మా ఇంటికి వచ్చి పరీక్షలు చేశారు. బీపీ, సుగర్‌తో పాటు పలు పరీక్షలు చేసి వైద్య శిబిరానికి రమ్మని కూపన్ ఇచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో నాకు పరీక్షలు చేసి అవసరమైన మందులు కూడా ఉచితంగా అందించారు. ఈ విధానం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇదే విధంగా సేవలందించాలని కోరుకుంటున్నాం.

– మాగాపు నాగమణి, కొమరాడ

బీపీతో పాటు సుగర్‌కు వైద్యం చేశారు



నా వయస్సు 79 సంవత్సరాలు. మాది నిరు పేద కుటుంబం. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవడం ఎంతో భారంతో కూడుకున్న పని. ప్రభుత్వం అందించే సేవలు పూర్తి సంతృప్తికరంగా ఉన్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నాకు బీపీ పరీక్షించి సుగర్ టెస్టులు చేశారు. ప్రత్యేక శిబిరంలో నిపుణులైన డాక్టర్లు మళ్లీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు.

– ఉండ్రు కృష్ణమూర్తి, కొమరాడ

గతంలో ఇలాంటి సేవలు చూడలేదు



ప్రభుత్వ వైద్య సేవలంటే గతంలో ప్రజల్లో చులకన భావం ఉండేది. కానీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. పేదలకు వైద్య పరంగా ఎన్నో సేవలందిస్తున్నారు. ఇంటింటికీ వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రికి వెళ్లే అవసరం లేకుండానే ఇంటి వద్దనే సేవలందిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ విధంగా సేవలందించలేదు.

– నేల శ్రీరామ్మూర్తి, మాకనపాలెం

జిల్లాలో 66 సురక్ష శిబిరాలు



జిల్లాలోని 22 మండలాల్లో నేటి వరకు 129 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేశాం. వాటి ద్వారా 45,857 మందికి ఉచితంగా వైద్య సేవలందించాం. 673 మందిని గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవల కోసం రిఫర్ చేశాం. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దిగ్విజయంగా జరుగుతుంది. ప్రజల నుంచి సురక్ష కార్యక్రమానికి మంచి ఆదరణ లభిస్తోంది.

– ఎం.సుమలత, నోడల్ అధికారి, జగనన్న ఆరోగ్య సురక్ష

సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలవాలని, ఆయన సీఎంగా ఉండగా గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అన్నివర్గాల వారికి మేలు చేకూరిందని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఆదివారం ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ అధ్యక్షతన జరిగింది. స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగన్ ఎందుకు కావాలంటే అనే త్వరలో ప్రారంభం కానుందన్నారు.కార్యక్రమంలో భాగంగా ప్రజల మధ్యలో నాయకులు, కార్యకర్తలు తిరిగి సీఎం జగన్‌అమలు చేసిన ప్రభుత్వ పథకాలను సమగ్రంగా చేరుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తారన్నారు. మరలా ఆయనే సీఎంగా కావాలంటే ప్రజలకు ఇంకా ఏ విధంగా సేవలందిస్తే మేలు చేకూరుతుందో అనే అంశాలను తెలుసుకుంటారన్నారు. గత ప్రభుత్వాలకు సీఎం జగన్ ప్రభుత్వానికి తేడాలను ప్రజలే గుర్తించి మరలా సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, మట్టపర్తి రామారావు, బొంతు రాజేంద్రప్రసాద్, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షురాలు వార జయసావిత్రి, చేట్ల రామారావు, మిండగుదిటి రాంబాబు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

కొత్తపేట: మండలంలోని మోడేకుర్రులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టినట్టు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి తెలిపారు. తోట్లపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభించగా నాణ్యతను ఆమె పరిశీలించారు. గడప గడపకూ పూర్తయిన మన గ్రామ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. దానిలో భాగంగా మోడేకుర్రులో రెండు సచివాలయాల పరిధిలో గడపగడపకూ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూర్తి చేశారు. దాంతో రూ.40 లక్షలు మంజూరు కాగా వాటి పరిధిలోని రాకుర్తివారిపాలెం, చిక్కాలవారిపేట, లైన్‌పేట, తోట్లపాలెం, కడలివారిపాలెం, మోడేకుర్రు, చర్చిపేట గ్రామాల్లో సీసీ రోడ్లకు రూ.32 లక్షలు, ఎలక్ట్రికల్ పోల్స్, కేబుల్‌కు రూ.4 లక్షలు కేటాయిస్తూ ప్రతిపాదనలు రూపొందించగా టెండర్లు కూడా ఖరారు


మోడేకుర్రులో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ రామలక్ష్మి

చేశారని సర్పంచ్ రామలక్ష్మి తెలిపారు. అలాగే వివిధ ప్రాంతాల్లో గడపగడపకూ, మండల పరిషత్, పంచాయతీ నిధులతో డ్రైన్లు నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకుడు కుడుపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు రోటరీ క్లబ్‌ను సందర్శించిన జిల్లా గవర్నర్

రాజోలు: రాజోలు రోటరీ క్లబ్‌ను జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు ఆదివారం సందర్శించారు. తన క్లబ్ అధికార పర్యటనలో భాగంగా ఆయన రాజోలు క్లబ్‌కు వచ్చారు. ఆయన మాట్లాడుతూ, ప్రపంచ శాంతికి, పోలియో నివారణకు రోటరీ క్లబ్ జాతీయంగాను, అంతర్జాతీయంగాను చేస్తున్న సేవలు గురించి వివరించారు. కాగా రోటరీ లక్ష్యాలను సాధించడంలో రాజోలు క్లబ్ గణనీయంగా పనిచేస్తోందని క్లబ్ అధ్యక్షుడు యేడిద కవీంద్ర అన్నారు. రాజోలు క్లబ్ చేస్తున్న సేవలను గవర్నర్ అభినందించారు. రోటరీ ఫౌండేషన్‌కు 150 డాలర్ల విరాళాన్ని గవర్నర్‌కు అందజేశారు. రాజోలు డిగ్రీ కాలేజీకి రెండు కంప్యూటర్లను క్లబ్ బహూకరించింది. మొగలికుదురు వృద్ధాశ్రమానికి రొటేరియన్ దార్ల పెదబాబు రూ.6,000 ఆర్థిక సాయం చేశారు. ఆశ్రమంలో వృద్ధ మహిళలకు చీరలను, పిల్లలకు నోట్స్ పుస్తకాలను, పెన్నులను రొటేరియన్ బహూ


రోటరీ క్లబ్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు

కరించారు. సమావేశంలో గవర్నర్‌ను క్లబ్ కార్యవర్గం సత్కరించింది. క్లబ్ కార్యదర్శి సీహెచ్ లక్ష్మణరావు, అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, రొటేరియన్స్ కిషోర్, రామకృష్ణ, తిరుమలరావు, సోమరాజు, నాని, వెంకటరమణ, పలువురు మహిళ రొటేరియన్స్ పాల్గొన్నారు.

29న విజయ భేతాళస్వామి ఉత్సవం

అంబాజీపేట: విజయదశమిని పురస్కరించుకొని అంబాజీపేట, మాచవరం అభ్యుదయ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న విజయ భేతాళ స్వామి వారి వాహన ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. అంబాజీపేట సంఘ కల్యాణ మండపం భవనంలో 18 పాలాల సంఘ సమావేశం కార్యదర్శి మట్టపర్తి రాము అధ్యక్షతన సంఘ అధ్యక్షుడు దొమ్మేటి వెంకట రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్య అర్జున మోహనరావు, ఉపాధ్యక్షుడు దొమ్మేటి శ్యామల ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. వారు మాట్లాడుతూ 15న భేతాళ స్వామి వారి కలశ స్థాపన జరుగుతుందన్నారు. కలశ స్థాపనకు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు రామారావు

చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, బొంతు పెదబాబు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీకి వ్యతిరేకంగా ధర్నా


అడవిపాలెంలో ధర్నా చేస్తున్న సర్పంచ్ అనంతలక్ష్మి, గ్రామస్తులు

మలికిపురం: మండలంలోని అడవిపాలెంలో ఓఎన్జీసీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా ప్రజలు ఆదివారం ధర్నా చేశారు. గ్రామంలో సుమారు ఏడు ఓఎన్జీసీ బావుల నుంచి గత 40 ఏళ్లుగా ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను తరలిస్తున్న ఓఎన్జీసీ తమ గ్రామానికి ఎటువంటి నిధులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఇరుకు రోడ్లపై భారీ వాహనాలను అత్యంత ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. పలు మార్లు ఆ సంస్థకు వినతి పత్రాలు ఇచ్చినా ఎటువంటి స్పందన లేదన్నారు. గత్యంతరం లేక ధర్నాకు దిగామని నాయకులు పేర్కొన్నారు. బట్టేలంక సెంటర్ నుంచి గుబ్బలపాలెం గ్రామం శివారు వరకూ అడవిపాలెంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని, గ్రామంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఓఎన్జీసీ అధికారులు ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో చర్చలు జరిపారు. ప్రజల డిమాండ్లకు అధికారులు అంగీకరించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. ధర్నా కొనసాగుతుంది. ఆందోళనలో సర్పంచ్ కొల్లు అనంతలక్ష్మి, ఎంపీటీసీ ఆచంట మాణిక్యం, నాయకులు నరసింహస్వామి, వార్డు సభ్యులు విం జమూరి నరేష్, కందికట్ల శాంతకుమారి, చెల్లుబోయిన పావని, బర్రే వీవీ సత్తిరాజు, తాడిచర్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ శౌర్య జాగరణ యాత్రకు ఘనస్వాగతం

కొత్తపేట: విశ్వహిందూ పరిషత్ షష్టిపూర్తి మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న శౌర్య జాగరణ యాత్రకు కొత్తపేటలో బీజేపీ నాయకులు, వీహెచ్‌పీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. గోమాత, భూమాత, మాతృభూమి, మత మందిరాలు, ధార్మిక గ్రంథాలు మొదలగు మహాబిందువుల రక్షణ కోసం హిందువుల ధర్మబద్ధమైన హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్న వీహెచ్‌పీ 1964 ఆగస్టు 29న కృష్ణాష్టమి రోజున స్థాపించబడి 59 సంవత్సరాలు పూర్తి చేసుకుని 60వ సంవత్సరం వచ్చిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వీహెచ్‌పీ శౌర్య జాగరణ యాత్ర చేపట్టినట్టు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, భజరంగ్‌దళ్ అధ్యక్షుడు శిరంగు నాయుడు తెలిపారు. యాత్ర రథం ఆదివారం కొత్తపేట చేరుకున్న సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, మండల శాఖ


కొత్తపేటలో వీహెచ్‌పీ యాత్రలో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ నేత పాలూరి తదితరులు

అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి తదితరులు స్వాగతం పలికి యాత్రలో పాల్గొన్నారు.

సినీ గేయ రచయిత సూర్యకు సత్కారం

అమలాపురం టౌన్: వర్ధమాన సినీ గేయ రచయిత శ్రీనివాస సూర్యను కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ ప్రతినిధులు అమలాపురంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సత్కరించారు. అమలాపురం ప్రాంతానికి చెందిన శ్రీనివాన సూర్య మిస్టరీ, ఒక్కడే చిత్రాలకు పాటలు రాశారు. ఈ సినిమాలు ఈ దసరాకు విడుదల అవుతున్న నేపథ్యంలో శ్రీనివాన సూర్యను కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు గనిశెట్టి రమణలాల్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కోనసీమ సినీ ఆర్టిస్టులు భద్రాజీ, ఎరుబండి చంటి, దుర్గారావు, ఆదుర్తి


సినీ గేయ రచయిత సూర్యను సత్కరిస్తున్న కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీనివాస్, నాయుడు, వెంకీ, దాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చిత్ర కళా ప్రదర్శన

అమలాపురం రూరల్: క్రియేటివ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగిన వందే వేద భారతం కార్యక్రమంలో రామాయణ, మహాభారత, భాగవతం అంశాలపై నిర్వహించిన చిత్రకళా ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. ఈ సభకు ప్రముఖ చిత్రకారుడు ఎస్.రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర స్థాయిలో 360 మందికి పైగా చిత్ర కళాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిత్రకారుడు రాంబాబును అకాడమీ అధ్యక్షుడు అకొండి అంజి, ఎస్ఎస్‌ఈ సీఎంవో సుబ్రహ్మణ్యం, సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు అకొండి పవన్‌కుమార్ తదితరులు సత్కరించారు.

వైద్యానికి సాయం

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యం చేయించుకోలేని పేదరికంలో ఉన్న బాధితుడికి వైద్యం చికిత్స కోసం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.22 వేల ఆర్థిక సాయం అందజేశారు. కొత్తపేట మండలం గంటి గ్రామానికి చెందిన గుత్తుల ధనరాజ్ ఇటీవల గంటి-ఈతకోట రహదారిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. రెండు కాళ్లకు నాలుగు చోట్ల ఎముకలు విరగడంతో పాటు ఎడమ చెయ్యి కూడా విరిగింది. పేదరికంతో ఇబ్బంది పడుతూ సరైన వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం


గుత్తుల లక్ష్మికి సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

కోరారు. దీంతో బాధితుడు భార్య గుత్తుల లక్ష్మికి ఆదివారం రూ.22 వేల నగదు సాయాన్ని సేవా సమితి సభ్యులు అందజేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఆత్రేయపురం: మండలంలోని పేరవరానికి చెందిన సలాది పార్వతి (27) మృతి చెందినట్లు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం ఈనెల 6న భార్యాభర్తలకు మధ్య వివాదం రావడంతో పార్వతీ పురుగులమందు తాగింది. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

దమ్మ దీక్షా కరపత్రాల ఆవిష్కరణ


అదుర్రు బౌద్ధ స్థూపం ప్రాంగణంలో దమ్మ దీక్షా కరపత్రాల ఆవిష్కరణ

మామిడికుదురు: అదుర్రులోని పురాతన అది బౌద్ధ స్థూపం వద్ద ఈ నెల 14న 67వ దమ్మ దీక్షా ఉత్సవాలు జరుగుతాయని బుద్ధ విహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి తెలిపారు. ఈ దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం బౌద్ధ స్థూపం ప్రాంగణంలో ఆవిష్కరించారు. బోధిసత్వ బాబా సాహెబ్ అంబేడ్కర్ బౌద్ధ దమ్మాన్ని స్వీకరించి 67 వసంతాలు పూర్తయిన సందర్భంగా 67వ దమ్మ దీక్షా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని భూపతి తెలిపారు. ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. కరపత్రాల ఆవిష్కరణలో సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, మెండి ప్రతాప్‌కుమార్ స్థానికులు పాల్గొన్నారు.

పెనికేరులో నేడు ఆరోగ్య సురక్ష

ఆలమూరు: మండలంలోని పెనికేరులో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరగనుందని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, సర్పంచ్ వనుం చిన్నావతి తెలిపారు. వారు మాట్లాడుతూ స్థానిక ఎంపీయూపీ స్కూల్ సమీపంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి గ్రామస్తులందరూ విచ్చేసి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ శిబిరంలో వివిధ విభాగాల్లో నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని వారు పేర్కొన్నారు.

డ్రోన్ పిచికారీపై నేడు అవగాహన సదస్సు

రాజోలు: మండలంలోని కడలి బీఆర్ నగర్‌లో ఈనెల 9న డ్రోన్ పిచికారీపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆదివారం మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ తెలిపారు. మార్టేరు వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్తలు డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని డెమో చేసి చూపిస్తారన్నారు. తక్కువ వ్యయంతో వ్యవసాయ పనులు చేయడం వల్ల పెట్టుబడి వ్యయం ఆదా చేయవచ్చన్నారు. డ్రోన్ పిచికారీ సదస్సుకు రైతులు హాజరు కావాలని కోరారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది కంటి పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

15 నుంచి శరన్నవరాత్రులు

అంబాజీపేట: విజయ దశమిని పురస్కరించుకుని అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద ఉన్న విజయ కనకదుర్గ, భక్తాంజనేయ స్వామి వార్ల ఆలయంలో ఈనెల 15 నుంచి దేవీశరన్నవరాత్రుల మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ చంద్రమౌళి కామేశ్వర శాస్త్రి (శర్మ) ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్య ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. దీనిలో భాగంగానే పందిరి రాటకు ముహూర్తం చేశారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని చల్లమ్మకు సన్మానం


గోగన్నమఠంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని చల్లమ్మను సత్కరిస్తున్న స్థానికులు

మామిడికుదురు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు అందుకున్న రామాయణం చల్లమ్మ, రమణ దంపతులను గోగన్నమఠం ప్రాథమికోన్నత పాఠశాలలో స్థానికులు ఆదివారం ఘనంగా సత్కరించారు. చల్లమ్మ విద్యార్థులకు ఉత్తమ సేవలందించారని వక్తలు పేర్కొన్నారు. ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కోరెడ్డి అంజిబాబు, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చల్లమ్మ దంపతులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, భూపతిరాజు సత్తిబాబురాజు, స్కూల్ హెచ్ఎం వి.సూరిబాబు, పీఎంసీ చైర్మన్ కె.హనుమంతరావు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

ఆలమూరు: గణపతి నవరాత్ర ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని సందిపూడిలో ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. స్థానిక విజయ గణపతి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పిండి వంటలతో నిర్వహించిన ఈ అన్నసమారాధనలో పరిసర ప్రాంతాల నుంచి సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం గణపతిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీలో శెట్టిబలిజలకు ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి సంఘీయులు అండగా నిలిచి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడుపూడి అశోక్ పిలుపునిచ్చారు. అప్పనపల్లిలో పార్టీ నేతల పాటి త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆదివారం అశోక్‌ను సన్మానించారు. మాజీ ఎంపీటీసీ జోగి వెంకటరామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర దృశ్యకళల అకాడమీ వైస్ పర్సన్ కుడుపూడి సత్యశైలజ, ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కుడుపూడి భరత్ మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆరాధ్య దైవంగా నిలిచారన్నారు. పార్టీ శ్రేణులు కష్టించి పని చేసి పార్టీ విజయం కోసం కృషి చేయాలని సూచించారు. సమావేశంలో మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

గ్రేడ్-3 ఈఓలకు శిక్షణ


గ్రేడ్-3 ఈఓలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో గ్రేడ్-3 ఈఓలకు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఏపీపీఎస్సీలో ఆరుగురు ఉత్తీర్ణత సాధించడంతో గ్రేడ్-3 ఈఓలుగా నియమితులయ్యారు. వారికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఈఓలు స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రేడ్-3 ఈఓలకు ఈఓ స్వామి చిత్రపటం అందజేశారు.

కలశాలతో మట్టి ఊరేగింపు


మామిడికుదురులో మట్టి ఊరేగింపులో పాల్గొన్న బీజేపీ నేతలు

మామిడికుదురు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అమర వీరులను స్మరిస్తూ ఢిల్లీలో ఏర్పాటు చేస్తున్న స్మృతి వనానికి తీసుకు వెళ్లేందుకు ప్రజల నుంచి సేకరించిన మట్టిని బీజేపీ నేతలు ఆదివారం మామిడికుదురులో ఊరేగించారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 18 గ్రామాల నుంచి సేకరించిన మట్టిని కలశాలతో ఘనంగా ఊరేగించారు. మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు అడబాల సత్యనారాయణ, చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, అడబాల రాంబాబు, కంకిపాటి సుబ్బారావు, వేగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సర్వే


రాజోలు నున్న వారి బాడవలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాజోలు: ప్రతిష్టాత్మంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాజోలు, పొదలాడ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది సర్వే చేపట్టారు. రాజోలు గ్రామ సచివాలయం-4 పరిధిలో నున్న వారి బాడవ, మట్టపర్తి కాలువగట్టు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సిబ్బంది బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఎంపీటీసీ కొవనాతి పుష్పలత, గృహసారథులు పాల్గొన్నారు.

బెట్టింగ్ జోలికెళితే కఠిన చర్యలు తప్పవు

రావులపాలెం: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ అమాయకులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని రావులపాలెం ఎస్సై ఎం.వెంకటరమణ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఐసీసీ క్రికెట్ ప్రపంచ కప్-2023 నేపథ్యంలో ప్రత్యేక నిఘా పెంచామన్నారు. అమాయకుల బలహీనతలను ఆసరాగా చేసుకుని ఎవరైనా డబ్బు ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదన్నారు. ఏపీ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తామన్నారు. రావులపాలెం పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే సదరు సమాచారాన్ని డయల్ 100కు సమాచారమివ్వాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. యువత బెట్టింగ్ రాయుళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.